హైదరాబాద్ వార్త



# సైనస్‌తో ...సతమతం

**-వాతావరణ మార్పులతో రోగాలు**
**-దగ్గు,జలుబు,తుమ్ములతో ఆసుపత్రుల బాట**
**-కోఠి ఈఎన్‌టి ఆసుపత్రికి పెరుగుతున్న ఓపీ**
**-రోజుకు 1500-2000 మందికి పైగా రోగులు**
**-చలికాలం అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న డాక్టర్లు**



**హైదరాబాద్, డిసెంబర్ 28,ప్రభాతవార్త:** ఇటీవల ఒకనకసారిగా వాతావరణం మారిపోయింది. రోజంతా మబ్బుపట్టి...సన్నని గాలులతో చలి గజగజలాడిస్తుంది. ఉదయం 9-10దాటినా చలితగ్గడం లేదు. పిల్లల నుంచి పెద్దవరకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ఆస్తమా ..సివోడిపి తదితర శ్వాసకోస సమస్యలు ఎదర్కొంటున్న వారికి ఈచలి మరింత ఇబ్బంది పెడుతుంది. ఎక్కువగా అలర్జీలు దాడి చేస్తున్నాయి. వారం రోజులుగా ఆసుపత్రులకు వచ్చే వారిలో 15శాతం మంది వరకు అలెర్జిక్ రైనైటీతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మందిలో జలుబు, పొడి దగ్గు, ముక్కు కారటం, వరుసగా తుమ్ములు, కళ్లనుంచి నీరు కారడం, కళ్లలో దురద తదితర లక్షణాలు ఉంటున్నాయి. దీనినే అలెర్జిక్ రైటీస్‌గా భావించాలని వైద్యులు పేర్కొంటున్నారు. ఛాతిలో బరువు, ఆయసం, జ్వరం పిల్లికూతలు లాంటి లక్షణాలు ఉంటే ఆస్తమాగా భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఈకాలంలో ఇంట్లో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ధుమ్ము దూళి శుభ్రం చేసేటప్పుటు, బాత్ రూంలో వాడే రసాయనాలు, అగర్‌బత్తీల పొగ పీల్చకుండా మాస్కు ధరించడం వల్ల అలర్జీల భారిన పడకుండా చూసుకోవచ్చునని పేర్కొంటున్నారు. సైనస్, అస్త మా సమస్యలు ఎదర్కొంటున్న వారు పల్లగా ఉన్న పండ్లు తింటే సమస్య మరింత పెరుగుతుం దని చలికాలంలో జాగ్రత్తగా ఉండాలని వైద్యుల చెబుతున్నారు.

**ఈఎన్‌టి ఆసుపత్రిలో ఫేషెంట్ల రద్దీ..**

రోజురోజుకు తీవ్రమవుతున్న కచలికారణంగా వైరల్ ఫీవర్లు, ఎన్‌ఫెక్షన్లు, అలర్జీలతో కోఠి ఈఎన్టీ ఆసుపత్రికి రోగుల రద్దీ పెరుగుతుంది. రోజూ 1000మంది వరకు ఉండే ఓపి ఇటీవల 1500 నుంచి 2వేలవరకు ఉంటుంది. కోఠీ ఆసుపత్రికి సిటీనుంచే నల్గొండ, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, అదిలాబాద్ జిల్లాలనుంచి కూడా పేషెంట్లు పెద్దఎత్తున వస్తున్నారు. దీంతో హాస్పిటల్‌లోని ఔట్‌పేషెంట్, బ్లాక్, ఇన్‌పేషెంట్ బ్లాక్‌లు నిండిపోయి కనిపిస్తున్నాయి. చిన్నారులకు అలర్జీ కారణంగా జలుబు వస్తుంటుందని ఈఎన్‌టి వైద్యులు చెబుతున్నారు. సైనస్, ఆస్తమా ఉన్న వాళ్లు చలికాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**లక్షణాలను తెలుసుకోండిలా..**

సైనస్ లక్షణాలు ఎలా ఉన్నాయి? అవి ఎంత కాలం నుంచి ఉన్నాయి? అనే దాన్ని బట్టి చికిత్స ఉంటుంది. జలుబు, అలర్జీలను తగ్గించే ముందులు, ముక్కు దిబ్బడను తగ్గించే డీకంజెస్టెంట్స్‌ను వాడటం ద్వారా ముక్కు రంధ్రాలను శుభ్రం చేయడంతో సైనస్ బాధలు తగ్గుతాయి. సైనస్‌తో బాధపడే వారు దాన్ని సాధ్యమైనంత త్వరగా తగ్గించుకుంటే మంచిదని ఆరోగ్య నిపుణలు చెబుతున్నారు. సైనస్ లక్షణాలను త్వరగా గుర్తించి, చికిత్స చేయించుకుంటే మంచిదని సూచిస్తున్నారు. నేసల్ ఎండోస్కోపీ విధానం ద్వారా ముక్కులో ఏదైనా అనాటామికల్ సమస్య ఉందేమో తెలుసుకోవాలి. సీటీ స్కాన్ ద్వారా సైనస్ ఇన్ ఫ్లమేషన్‌ను తెలుసుకొని చికిత్స చేయించుకోవాలి. సైనస్‌తో బాధపడేవారు వ్యాయామం లాంటివి చేస్తూ దుమ్ము, ధూళికి దూరంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఒత్తిడి లేకుండా చూసుకోవాలి. ఇలాంటి వాళ్లకు ఆవిరి పట్టడం వల్ల ప్రయోజనం ఉంటుంది. చిక్కగా ఉండే శ్లేష్మం పలుచగా మారుతుంది. వేడినీళ్లతో స్నానం చేయాలి.

# తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్లుగా గోవర్ధన్, తనుజా

**హైదరాబాద్, డిసెంబర్ 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన భారత నంబర్ వన్ సెయిలర్ గోవర్ధన్ పల్లారా సబ్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచాడు. భారత రెండో ర్యాంకర్ దీక్షిత కొమరవెల్లి రన్నరప్‌గా నిలిచింది. సబ్ జూనియర్ బాలికల విభాగంలో హైదరాబాద్ సెయిలర్ తనుజా కామేశ్వర్ ట్రోఫీ గెలిలిచింది. మొత్తం తొమ్మిది రేసుల్లో గోవర్ధన్ 25 పాయింట్లతో అగ్రస్థానం సాధించాడు. చివరి రేసుకు ముందు అతను ఓవరాల్‌గా రెండవ స్థానంలో నిలిచాడు. ఆఖరి రేసులో గోవర్ధన్, దీక్షిత మధ్య హోరాహోరీ పోటీ నిలిచింది. ఒక దశలో నాలుగో స్థానానికి పడిపోయిన గోవర్ధన్ చివరి లెగ్‌లో అద్భుతంగా పుంజుకొని తిరిగి అగ్రస్థానానికి వచ్చాడు. ఆఖరి రేసులో రెండు నుంచి 14వ స్థానానికి పడిపోయినా.. ఓవరాల్‌గా 27 పాయింట్లతో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. దాంతో గోవర్ధన్ రాష్ట్ర సబ్ జూనియర్ చాంపియన్‌గా, దీక్షిత రన్నరప్‌గా నిలిచారు. నల్గొండకు చెందిన గిరిజన కుర్రాడు శ్రవణ్ కత్రావత్ ప్రత్యర్థుల నుంచి ఎలాంటి సవాల్ లేకపోవడంతో రాష్ట్ర బాలుర జూనియర్ చాంపియన్‌గా నిలిచాడు. ఆదివారి జరిగే చివరి రేసులో అతను పోటీ పడాల్సిన అవసరం లేకుండా పోయింది. అలాగే రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో హైదరాబాద్ ఉద్భవ్ స్కూల్‌కు చెందిన తనుజా కామేశ్వర్ సత్తా చాటింది. డబుల్ హ్యాండ్ స్కిఫ్ క్లాస్, డబుల్ హ్యాండర్ డింగీ క్లాస్, ఐఎల్‌సీఏ4 సింగిల్ హ్యాండర్ విభాగాల్లో మూడు స్టేట్ చాంపియన్‌షిప్ స్వర్ణాలతో హ్యాట్రిక్ సాధించింది. ఆదివారం ముగిసే పోటీల్లో తనుజా కామేశ్వర్ ఈ టోర్నీల్లో అత్యంత విజయవంతమైన సెయిలర్‌గా మారనుంది. ఇప్పటికే స్వర్ణాలు ఖాయం అవ్వడంతో ఆమె చివరి రేసులో పాల్గొనాల్సిన అవసరం లేకుండా పోయింది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు సంజీవయ్య పార్క్‌లోని యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌లో టోర్నీ ముగింపు, బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత మరియు జాతీయ బాలల హక్కుల కమిషన్ మాజీ చైర్‌పర్సన్ డా.శాంత సిన్హా, తెలంగాణ ప్రభుత్వం సమాచార సాంకేతిక, పరిశ్రమలు, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేస్తారు.



విజేతగా నిలిచిన గోవర్ధన్, తనుజా

# ప్రత్యేక అవసరాలతో పిల్లలకు వసతి గృహాలు

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

**హైదరాబాద్, డిసెంబర్ 28, ప్రభాతవార్త:** జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం త్వరలో వసతి గృహం ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వికలాంగుల హక్కుల చట్టము 2016 హైదరాబాద్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక అవస రాలు గల పిల్లల కోసం హోమ్ త్వరలో ఏర్పాటు చేస్తామని అన్నారు. కమిటీ సమావేశంలో సభ్యులు తెలిపిన విషయాలపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు పద్మశ్రీ శ్రీ సాయి బాబా గౌడ్ మాట్లా డుతూ జిల్లాలో అనేక స్వచ్ఛంద సంస్థలు. వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాయని అన్నారు.ఎఫ్‌ఈడి ఫౌండర్ ప్రెసిడెంట్ గంగారం గారు మాట్లాడుతూ అందులకు బస్సులలో అన్ని విధాలుగా ప్రయాణానికి వీలుగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. మరొక మెంబరు నాగభూషణం మాట్లాడుతూ జిల్లాలో వివిధ శాఖల లో ఉన్నటువంటి ఉద్యోగ ఖాళీలను గుర్తించి అర్హులైన వికలాంగులకు ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ మెంబర్ కొల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహించబ డుతున్న కొన్ని థెరపీ సెంటర్లను తనిఖీ చేసి నిబంధన ప్రకారం లేనటువంటి సంస్థలను మూసివేయాలని కోరారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలలో లిఫ్ట్ లలో వికలాం గులకు లిఫ్ట్ ఆపరేటర్ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.అలాగే వికలాంగుల చేత నడపడుతున్న చిన్నచిన్న దుకాణాలను జిహెచ్‌ఎంసి వారు తొలగించకుండా తగు సూచనలు ఇవ్వవల సిందిగా కోరారు. కమిటీ సభ్యులు చెప్పినటువంటి విషయాలన్నీ విన్నటువంటి జిల్లా కలెక్టర్ అన్ని అంశాలపై వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ మెంబర్లు జిల్లా స్థాయి అధికారులు కోటాజి, జిహెచ్‌ఎంసి, ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టండి

**-అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**నిజాంపేట్, డిసెంబర్ 28, ప్రభాతవార్త**

చెత్త దుర్గంధంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద రాత్రి వేళల్లో చెత్తను అక్రమంగా డంపింగ్ చేయడం వల్ల దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి అక్రమ డంపింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో అక్రమంగా చెత్త డంపింగ్ చేస్తున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ ఎన్ఎంసి అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, రవికిరణ్, ఆగం రాజు, బొర్ర దేవి చందు ముదిరాజ్, ఏఈ ప్రవీణ్, వాటర్ వర్క్స్ డీజీఎం చంద్రమోళి, మేనేజర్ సౌమ్య, ఎన్విరాన్మెంటల్ ఏఈ సూకృతా రెడ్డి, సర్వేయర్ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, పలు డివిజన్ల అధ్యక్షులు, స్థానిక నాయకులు, హిల్ కౌంటీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఈటల

**కంటోన్మెంట్, డిసెంబరు 28 ప్రభాతవార్త:** వివిధ రోగాలతో బాధపడుతున్న పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. శనివారం బొల్లారంలోని కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అవ్‌ట్ పేసెంట్‌ల విభాగంలో వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగులను, డాక్టర్లను పలకరించి వారి ఇబ్బందులును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆల్ట్రాసౌండ్, రేబిస్ వ్యాక్సిన్ లేదని రోగులు ఎంపీ దృష్టికి తెచ్చారు. అదే విధంగా ఎక్స్‌రే బ్లెడ్ టెస్టులకు సిబ్బంది డబ్బులు తీసుకుంటున్నారని అయన దృష్టికి తెచ్చారు. రోగులకు మందులు అందుబాటులు లేవన్నారు. ఈ అంశాలపై సూపరిండెండ్ డాక్టర్ రామక్రిష్ణను అడిగి ఆరా తీశారు.



బొల్లారం ఆసుపత్రిని తని సందరి ్శంచిన ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు

# భర్త మందలించడంతో గృహిణి ఆత్మహత్య

**గచ్చిబౌలి, డిసెంబరు 28 ప్రభాతవార్త :** కుమార్తెను సరిగా చూసుకోవడం లేదని భర్త మందలించడంతో మనస్థాపానికి గురైన ఓ మహిళ తన ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... శేరిలింగంపల్లి మండల పరిధిలోని గౌలిదొడ్డి గుడిసెల్లో నర్సింహ, తన భార్య తుముతుగొల్ల స్వాతి(23), ఏడాదిన్నర వయస్సు ఉన్న కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నాడు. నర్సింహ స్థానికంగా రాయికొట్టే పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా నర్సింహ కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండగా, స్వాతి పనికి వెళ్లకుండా గతకొంత కాలంగా ఇంట్లోనే ఉంటుంది. అనారోగ్యంతో ఉన్న కుమార్తెను సక్రమంగా చూసుకోవడం లేదని నర్సింహ తన భార్య స్వాతిని మందలించాడు. భర్త మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన స్వాతి శనివారం ఉదయం భర్త పనికి వెళ్లిన తరువాత తన గుడిసెలో గుడిసె కర్రకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం 11 గంటల ప్రాంతంలో అత్త మంజుల వచ్చి చూడడంతో స్వాతి ఆత్మహత్య విషయం వెలుగు చూసింది. స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# తాగునీటికి పక్కా ప్రణాళికలు



**-మురుగునీరు శుద్ధి చర్యలు**
**-2050 నాటికి 1114 ఎంజిడిల తాగునీరు అవసరం**
**-ప్రతి రోజు శుద్ధి అవుతున్నది 772 ఎంఎల్‌డిలే**
**-కొత్త ప్రణాళికలతో జలమండలి ముందుకు**
**-జలమండలి ఏడాది రౌండప్-2024**
**-ఈ యేడాది జలమండలికి ఎండి, ఈడి కొత్త సారధులు**

**హైదరాబాద్, డిసెంబరు 28 ప్రభాతవార్త :** మెట్రోపాలిటన్ సిటి హైదరాబాద్ మహానగరానికి జలమండలి తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలు అందిస్తోంది. 1.3 కోట్లకు పైగా ఉన్న జనాభాకు ఇలాంటి సేవలు అందించడం సవాలుతో కూడుకున్న పని. అంతటి మహత్తరమైన పనిని జలమండలి సమర్థంగా నిర్వహిస్తున్నది. యేటేటా తన పరిధితో పాటు సేవల్ని విస్తరించుకుంటూ ప్రస్తుతం ఔటర్ రింగ్ రోడ్డు దాకా వ్యాపించింది. ఔటర్ చుట్టూ ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, గ్రామపంచాయతీలు, ఇతర స్థానిక సంస్థలకు సైతం తాగునీరు సరఫరా చేస్తోంది.

**బోర్డుకు కొత్త సారథులు**

జలమండలికి ఈ ఏడాది కొత్త మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వచ్చారు. వీరిలో ఎండి అశోక్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఈడిగా పనిచేసిన అనుభవముంది. కొత్త ఈడిగా వచ్చిన మయాంక్ మిట్టల్ నారాయణపేట్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. గోదావరి ప్రాజెక్టు రెండో దశ పనులు రాష్ట్ర ప్రభుత్వం గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-2కు పచ్చజెండా ఊపింది. ఈ పథకం ద్వారా నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర జలాశయాల్ని పునరుజ్జీవం చేయనుంది. ప్రస్తుతం 560 ఎంజీడీల నీరు సరఫరా చేస్తుండగా 2030వ సంవత్సరం వరకు హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 867 ఎంజిడిలకు పెరుగుతుంది. 2050 నాటికి ఈ సంఖ్య 1114 ఎంజిడిలుగా ఉండనుంది. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్-1 కింద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టిఎంసిల నీరు తరలిస్తోంది. తాజాగా పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టిఎంసిల నీరు వాడుకునే అవకాశం ఉంది. మూసి ప్రక్షాళనలో భాగంగా జంటజలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు 5 టిఎంసిలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పంప్‌హౌజ్‌లు, సబ్‌స్టేషన్లు, నీటి శుద్ధి కేంద్రాలు, భారీ పైపులైన్ నిర్మించనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ 1 ద్వారా 163 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నారు.ఎస్‌టిపిల నిర్మాణం వంద శాతం మురుగు శుద్ధి లక్ష్యం హైదరాబాద్ నగరంలో ఉత్పన్నమయ్యే మురుగు నీటిని 100 శాతం శుద్ధి చేసే దిశగా జలమండలి అడుగులు వేస్తున్నది. ఇందుకోసం పలు చోట్ల మురుగు నీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టిపిలు) నిర్మిస్తున్నది. హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 ఎంఎల్‌డి మురుగు నీరు ఉత్పన్నమవుతుంది. ఇది జిహెచ్‌ఎంసి ప్రాంతంలో 1650 ఎంఎల్‌డిలుగా ఉంది. ఇప్పటికే 25 ఎస్‌టిపిల ద్వారా 772 ఎంఎల్‌డిల మురుగు నీటిని (46 శాతం) శుద్ధి చేస్తున్నారు. ఇది దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అధికం. మిగిలిన 878 ఎంఎల్డీల మురుగు నీటిని శుభ్రం చేయడానికి రూ.3866.41 కోట్ల వ్యయంతో కొత్తగా 1106 సామర్థంతో ఎస్‌టిపిల ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. 2036 సంవత్సరం వరకు రాబోయే కాలంలో ఉత్పన్నమయ్యే మురుగును వీటి ద్వారా శుద్ధి చేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే 11 ఎస్‌టిపిలు ప్రారంభమై మురుగు నీటిని శుద్ధి చేస్తున్నాయి. వీటిలో కోకాపేట (15 ఎంఎల్‌డిలు), దుర్గం చెరువు (7 ఎంఎల్‌డిలు), నల్లచెరువు (86.50 ఎంఎల్‌డిలు), పెద్దచెరువు 17.50 ఎంఎల్‌డిలు), మియాపూర్ పటేల్ చెరువు (7 ఎంఎల్‌డిలు), ఖాజాకుంట (20 ఎంఎల్‌డిలు), ఫతేనగర్1 (133 ఎంఎల్‌డిలు) నాగోల్(320ఎంఎల్‌డిలు), సఫిల్ గూడ (5.5ఎంఎల్‌డిలు) 1 ఎస్‌టిపి ఉంది. కాగా 443 ఎంఎల్‌డిల సామర్థం కలిగిన మరో 9 ఎస్‌టిపిల నిర్మాణం చివరిదశలో ఉన్నాయి. వీటిని త్వరలోనే ప్రారంభిస్తారు. ఇవే కాకుండా అమృత్ 2.0 మూడో దశకింద మరో 39 ఎస్‌టిపిల నిర్మాణానికి ప్రతిపాదించడం జరిగింది. అదేవిధంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లలో మురుగు చేరకుండా మరో నాలుగు నిర్మాణం చెయ్యనున్నారు.90 రోజుల ప్రత్యేక కార్యాచరణ సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ 90 రోజుల స్పెషల్ డ్రైవ్ లో జలమండలి ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి సారించింది. హైదరాబాద్ నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న సివరేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఇంకుడు గుంతల నిర్మించుకునేలా చర్యలు చేపట్టింది. ఈ మహత్తర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీ జయంతిన ప్రారంభించారు. ఇందులో ప్రధానంగా సివరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో పేరుకుపోయిన సిల్ట్ తొలగించారు. తద్వారా రోజూ వచ్చే ఫిర్యాదులను 30 శాతానికి తగ్గించారు. ఈ 90 రోజుల ప్రత్యేక కార్యాచరణలో ఈనెల 28వ తేది నాటికి నాటికి మొత్తం 16,395 ప్రాంతాల్లో 2,106 కిలోమీటర్ల పైపులైన్ల, 1 లక్ష 68 వేల మ్యాన్ హోళ్లలో డీసిల్టింగ్ చేశారు. ఇదే కాకుండా మురుగు నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోవాలని జలమండలి విస్తృత అవగాహన కల్పిస్తోంది. కమ్యూనిటీలు, కాలనీలు వాటి నిర్మాణం చేపట్టాలని సూచించింది. దీని వల్ల మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు వెళ్లకుండా ఉంటాయి. వన్ టైమ్ సెటిల్ మెంట్ స్కీమ్ దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న నల్లా బిల్లుల వసూలుకు వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం-2024 ప్రవేశపెట్టింది. రెండు నెలలు ఈ పథకం అందుబాటులో ఉండగా 1.17 లక్షల మంది వినియోగదారులు రూ.102 కోట్ల విలువైన బిల్లులు చెల్లించి రూ.35 కోట్ల రాయితీ పొందారు.వందేళ్ల గండిపేట్ కాండూట్‌కు మరమ్మతులు హైదరాబాద్ నగరంలో చరిత్రాత్మక గండిపేట్ కాండూట్‌ను పదేళ్లుగా వేధిస్తున్న లీకేజీ సమస్యకు జలమండలి అడ్డుకట్ట వేసింది. ఈ కాండూట్‌కి గత 10 సంవత్సరాల నుంచి గండిపేట్, కోకాపేట్, మణికొండ, సిబిఐటి కాళాశాల, పుప్పాలగూడ, జానకీ నగర్, కౌసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో తీవ్ర లీకేజీలు ఏర్పడ్డాయి. అయితే, ఈ లీకేజీలను అరికట్టడానికి మరమ్మతులు చేపడితే నీటి సరఫరాలో నెల రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుంది. నీటి సరఫరాకు ఆటంకం కాకుండా చెన్నైకి సంబంధించిన కంపెనీ జర్మన్ టెక్నాలజీతో లీకేజీలు అరికడతామని ముందుకొచ్చి అధికారులు కెమికల్ ట్రీట్ మెంట్ పద్ధతిని ఉపయోగించి మరమ్మతులు పనులు చేపట్టింది.

**వేసవిలో నీటి సరఫరా...**

ఈ వేసవిలో నగరంలో భూగర్భ జలాల స్థాయి భారీగా పడిపోవడంతో తాగునీటి సరఫరాకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో ప్రజలకు నీరు సరఫరా చేసే జలమండలిపై ఒక్కసారిగా ఒత్తిడి పెరిగింది. వేసవి ప్రారంభంలో చిన్నపాటి ఒడుదొడుకులు ఎదుర్కొన్నా, తరువాత కాలంలో పుంజుకుని ప్రజలకు తాగునీటి సేవలందించింది. ఈ సమయంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రావొద్దని, ప్రధాన వనరులైన నాగార్జున సాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో ఎమర్జెన్సీ పంపింగ్ ప్రారంభించింది. ఇప్పటికే ఉన్న ట్యాంకర్లు, డ్రైవర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, పాయింట్లు పెంచి.. రోజూ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసింది. జలమండలి పరిధిలో దాదాపు 733 కి పైగా ట్యాంకర్లు, 78 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా ఈ ఏడాది మొత్తం 16,43,660 ట్యాంకర్ ట్రిప్పులను డెలివరీ చేశారు. కంటోన్మెంట్ బోర్డుకు అదనపు నీటి సరఫరా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు కాకుండా అదనంగా 1 ఎంజిడిని పెంచింది. అక్కడున్న 40 వేల నల్లా కనెక్షన్లకు 5.9 ఎంజీడీల నీరు సరఫరా చేస్తుండగా.. అవి సరిపోవడం లేదని ఎమ్మెల్యే గణేష్ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఎండి అశోక్ రెడ్డి ఎమ్మెల్యేతో సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. జలమండలిలో ఈ ఏడాది మొత్తం 25 మందికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. సర్వీసు పిరియడ్‌లో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించారు. జనవరిలో 3, జూన్ 3, జులై3, సెప్టెంబర్ 7, నవంబర్ 5, డిసెంబర్‌లో 4 చొప్పున మొత్తం 25 మందికి ఉద్యోగాలిచ్చారు.

# మైహోం విహంగాలో హౌజ్ కీపింగ్ మేనేజర్ ఆత్మహత్య

**గచ్చిబౌలి, డిసెంబరు 28 ప్రభాతవార్త**

గచ్చిబౌలి మైహోం విహంగాలో హౌజ్ కీపింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి స్టోర్ రూమ్‌లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన జి.నరేందర్(46) ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చి బాచుపల్లి పరిధిలోని అపూర్వ అపార్టుమెంట్స్‌లో నివాసం ఉంటూ గచ్చిబౌలిలోని మైహోం విహంగాలో హౌజ్ కీపింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఉద్యోగానికి వచ్చిన నరేందర్ తన తోటి ఉద్యోగులతో పనికి సంబంధించి మీటింగ్ నిర్వహించాడు. అనంతరం అపార్టుమెంటు ఆవరణలో నరేందర్ కనిపించలేదు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తోటి ఉద్యోగులు భోజనం చేసేందుకు నరేందర్‌కు ఫోన్ చేయగా ఫోన్ తీయలేదు. మద్యాహ్న భోజనం అనంతరం హౌజ్ కీపింగ్ పనులు చేసే సురేష్ అనే వ్యక్తి అపార్టుమెంటులో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ ట్రీని స్టోర్ రూమ్‌లో భద్రపరిచేందుకు వెళ్లాడు. స్టోర్ రూమ్ తలుపులు తీయగా, గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు స్టోర్ రూమ్‌లో ఉన్న బట్టతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న నరేందర్ నిర్జీవంగా కనిపించాడు. దీంతో అపార్టుమెంటు నిర్వాహకులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడు నరేందర్‌కు బార్య మీనా, కుమారుడు, కుమార్తె ఉన్నారని, నరేందర్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.

# వైద్యుల నిర్లక్ష్యం కారణంతో పసికందు మృతి..

**-బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు నిరసన..**

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 28, ప్రభాతవార్త :** ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన పసికందు మృతి చెందిందంటూ భాదిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేసిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, భాదితులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా తుప్రాన్ సమీపంలో మనోహరబాద్ గ్రామానికి చెందిన టి.ప్రభాకర్ తన భార్య జ్యోతికను ఈ నెల 25న కొంపల్లిలోని సురేఖ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో ఆసుపత్రిలో వైద్యులు పట్టించుకోకపోవడం వలన పురిటినొప్పులు అధికం కావడంతో ఆసుపత్రిలో ఉన్న నర్సులే సేవలు అందించారు. దీంతో సాధారణ ప్రసవం కావడంతో పుట్టిన బిడ్డ వైద్యుల పర్యవేక్షణ లేకపోవడంతో స్పర్శలేకుండా పోయింది. పసిపాపను మెరుగైన వైద్యం కోసం కొంపల్లిలో ఉన్న మరో పిల్లల ఆసుపత్రికి తరలించగా అందులో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో కోపొద్రిక్తులైన భాదితురాలి కుటుంబ సభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా పసిపాప మృతి చెందిందంటూ ఆందోళన వ్యక్తం చేస్తూ సురేఖ ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ఆసుపత్రిలో ఏలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా చర్యలు తీసుకొని తర్వాత భాదితులకు, ఆసుపత్రి యాజమాన్యానికి మధ్య ఒప్పందాన్ని కుదిర్చి పంపించారు. కాగా దీనిపై సీఐ విజయవర్ధన్‌ను వివరణ కోరగా తమకు భాదితులు ఏలాంటి ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం.

# బిజెపి నాయకుడిపై దాడి చేసిన నలుగురు అరెస్టు

**చార్మినార్,డిసెంబరు 28 ప్రభాతవార్త :** పాతబస్తీ మామాజుమ్లాపాఠక్‌లో శుక్రవారం రాత్రి పాతబస్తీకి చెందిన కొంత మంది వ్యక్తులు ఘాన్సీబజార్‌కు చెందిన బిజెపి నాయుకుడిపై దాడి చేయటంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.దాడి చేసిన నలుగురిని చార్మినార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.చార్మినార్ పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం.... పాతబస్తీకి చెందిన నాసిర్ శుక్రవారం రాత్రి మామాజుమ్లా పాఠక్ రహదారి మీదుగా కారులో వెళుతున్నాడు.రహదారిలో రద్దీ ఉండటంతో నాసిర్‌కు,స్థానిక బిజెపి నాయకులు వైభవ్ శర్మ మధ్య వాహనాలు నిలిపిన విషయంలో వివాదం చోటు చేసుకుంది.కాగా కొంత సమయం వ్యవధిలోనే నాసిర్‌తో పాటు పాతబస్తీలోని వస్త్రాల దుకాణాలలో పని చేస్తున్న మహ్మద్, బిలాల్,ఫైజాన్‌లు కలిసి బిజెపి నాయకులు వైభవ్ శర్మపై దాడి చేశారు.ఈ సంఘటనపై బిజెపి నాయకులు చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ విషయాన్ని చార్మినార్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని,బిజెపి నాయకులు వైభవ్‌శర్మపై దాడి చేసిన నాసిర్,మహ్మద్,బిలాల్,ఫైజాన్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

